

సమావేశంలో ప్రసంగిస్తున్న స్టాలిన్

తొలి జేఏసీ సమావేశం సక్సెస్

ఒకే వేదికపై 7 రాష్ట్రాల నేతలు ● అన్నీ తానై నిర్వహించిన సీఎం ● స్టాలిన్‌కు బాసటగా ఉదయనిధి, కనిమొళి

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం చేపట్టదలచిన జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ శనివారం డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన జేఏసీ సమావేశం విజయవంతమైంది. ఆద్యంతం అన్నీ తానై వ్యవహరించిన సీఎం క్షణం తీరిక లేకుండా నేతలతో మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ, సమాలోచనలు చేస్తూ కనిపించారు. ఆయనకు ఎంపీ కనిమొళి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సహకరించారు. వారు నేతలను దగ్గరుండి సమావేశానికి తీసుకురావడమే గాక, అతిథులను సత్కరించే శాలువలు, బహుమతులు అందిస్తూ సీఎం సూచనలు అమలు చేశారు. స్థానిక గిండిలోని ఐటీసీ చోళా హోటల్లో జరిగిన ఈ సమావేశానికి 24 పార్టీలకు చెందిన 30 మందికి పైగా నేతలు హాజరయ్యారు. కేరళ సీఎం పినరయి విజయన్ శుక్రవారం ఉదయమే నగరానికి విచ్చేశారు. ఆ తర్వాత శుక్రవారం రాత్రికల్లా ఏడు రాష్ట్రాల నుంచి పార్టీల నాయకులు, ప్రతినిధులు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటకు డిప్యూటీ సీఎం శివకుమార్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ సమావేశం జరుగనున్న స్టార్ హోటల్‌కు చేరుకున్నారు. ఈ హోటల్ మీనంబాక్కం విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో వచ్చిన నేతలందరికీ పటిష్ఠ కమెండోలు, పోలీసుల భద్రత కల్పించారు. విచ్చేసిన నేతలందరికీ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. విమానాశ్రయం చేరిన నేతలందరికీ ఓ మంత్రి, ఓ ఎంపీ చొప్పున పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. శుక్రవారం రాత్రి హోటల్‌లోనే బస చేసిన నేతలంతా ఉదయం 10 గంటలకల్లా సమావేశానికి సిద్ధమయ్యారు. తొలుత సీఎం స్టాలిన్‌తో అందరూ సమావేశమయ్యారు. ఆ సందర్భంగా నేతలందరినీ ఆయన శాలువలతో సత్కరించారు. అటు పిమ్మట సమావేశం హాలులో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, కర్ణాటక డిప్యూటీ సీఎంకు, వివిధ రాష్ట్రాలకు చెందిన పార్టీనేతలు ప్రతినిధులను స్టాలిన్ వరుసగా శాలువలతో సత్కరించి, ఓ పెట్టెను బహూకరించారు.

25 యేళ్లపాటు వాయిదా

అటు పిమ్మట సీఎం స్టాలిన్ స్వాగతోపన్యాసం చేశారు. ఆ తర్వాత నాయకులంతా కలిసి పునర్విభజనను అడ్డుకునే దిశగా చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చలు జరిపారు. పునర్విభజనను 25 యేళ్లపాటు వాయిదా వేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం చేశారు. కేంద్ర ప్రభుత్వం న్యాయసమ్మతంగా పునర్విభజన జరుపకపోతే పార్టీ విబేధాలను పక్కన బెట్టి సమైక్యంగా పోరాడాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు పట్ల నేతలంతా హర్షం ప్రకటించారు. కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్ మాట్లాడుతూ... ఈ సమావేశాన్ని 'ఉత్తరాది రాష్ట్రాలపై దక్షిణాది రాష్ట్రాలు సాగించనున్న యుద్ధంగా అపోహపడకూడదు సుమా' అని పేర్కొన్నారు. ఇక సమావేశంలో ప్రసంగించిన నేతలందరూ పునర్విభజన వల్ల కలిగే నష్టాలపై క్లుప్తంగా ప్రసంగించడం విశేషం. తొలుత ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లుప్తంగా ప్రసంగించారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, డీఎంకే ఎంపీ కనిమొళి ఆంగ్లంలో ప్రసంగించారు. ఎంపీ టీఆర్‌బాలు వందన సమర్పణ చేశారు. సీనియర్ మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం తదితరులు కూడా సమావేశంలో పాల్గొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశం మధ్యాహ్నం 1.30 గంటల దాకా సాగింది.

దేశం దృష్టి జేఏసీ వైపు...

డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను ఆకట్టుకుంది. కొంతమంది జాతీయ నాయకులు సైతం సమావేశం సాధారణంగా జరుగుతుందని అంచనా వేశారు. ఇందుకు భిన్నంగా సమావేశం విజయవంతం కావడంతో 'తండ్రికి తగ్గ తనయుడు' అంటూ పలువురు నేతలు స్టాలిన్ అభినందనలతో ముంచెత్తారు. వీపీసింగ్, దేవెగౌడ, ఐకే గుజ్రాల్‌ను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టిన కరుణానిధి లాగే భవిష్యత్తులో ప్రధానిని ఎంపికే చేసే 'కింగ్ మేకర్' అవుతారంటూ స్టాలిన్‌ను డీఎంకే కార్యకర్తలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. స్వాగతోపన్యాసంలో స్టాలిన్ మాట్లాడుతూ... నియోజవర్గాల పునర్విభజనకు తామంతా వ్యతిరేకం కాదని, ఆ విభజన దక్షిణాది రాష్ట్రాలకు చేటు కలిగించకూడదని, కనుకనే తామంతా న్యాయ సమ్మతమైన పునర్విభజనను కోరుకుంటున్నామని చెప్పారు. ఈ భావనను తలపించే రీతిలోనే వేదిక వెనుక 'ఫెయిర్ డీలిమిటేషన్ ఫస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ మీటింగ్' అంటూ ఆంగ్లంలో ముద్రించిన బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.

సోషల్ మీడియాలో ట్రెడింగ్...

జేఏసీ సమావేశం ప్రారంభం కాగానే సోషల్ మీడియాలో ఆ సమావేశం వివరాలు ఎప్పటికప్పుడూ వెలువడుతూ వైరల్ అయ్యాయి. నాయకుల ప్రసంగాలను క్లుప్తంగా అప్పటికప్పుడే ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాంలలో వెలువరించారు. 'ఫెయిర్ డీలిమిటేషన్' (న్యాయసమ్మతమైన పునర్విభజన) పేరుతో ఈ సమావేశం వివరాలన్నీ జోరుగా ట్రెండింగ్ అయ్యాయి.

జేఏసీ తీర్మానాలివే...

ఉమ్మడి కార్యాచరణ కమిటీలో నేతలందరూ చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ వివరాలిలా వున్నాయి...

- పునర్విభజనపై పారదర్శకత అవసరం. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన వల్ల నష్టపోనున్న రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండా, ఎలాంటి పారదర్శకత లేకుండా నియోజకవర్గాల పునర్విభజనను నిర్వహించేందుకు కేంద్రప్రభుత్వం చేపడుతున్న చర్యలపట్ల ఉమ్మడి కార్యాచరణ కమిటీ తీవ్ర అందోళన వ్యక్తం చేస్తోంది. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాల రాజకీయ, ఆర్థిక పరమైన భవిష్యత్తును కాపాడే దిశగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీసుకున్న చొరవను కమిటీ సంతృప్తిని ప్రకటిస్తోంది. పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని కమిటీ డిమాండ్ చేస్తోంది.
- కేంద్ర ప్రభుత్వం పునర్విభజనను పారదర్శకంగా జరపాలి. అదే సమయంలో పునర్విభజన వల్ల ఏ రాష్ట్రాలు నష్టపోకుండా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వాలతో సమగ్రమైన చర్చలు జరిపిన మీదటే ప్రజాస్వామ్యబద్ధంగా తగు నిర్ణయం తీసుకోవాలి.
- రాజ్యాంగ ధర్మాసనం 42వ, 84వ, 87వ సవరణల వెనుకనున్న శాసన ఉద్దేశం జనాభా నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేసిన రాష్ట్రాలను సంరక్షించి ప్రోత్సహించాలని చెబుతుందని, అదే సమయంలో జాతీయ జనాభా స్థిరీకరణ లక్ష్యం ఇంకా సాధించకపోవడంతో 1971 జనాభా లెక్కల ప్రకారమే ప్రస్తుత మున్న లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను యధాతథంగా 25 యేళ్లపాటు కొనసాగించాలి.
- జనాభాను సమర్థవంతంగా నియంత్రించి దేశజనాభా శాతాన్ని తగ్గించడంలో కీలకపాత్రలను పోషించిన రాష్ట్రాలకు పునర్విభజన శిక్షించేలా లేదా దండించేలా ఉండకూడదు. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా అవసరమైన రాజ్యాంగ చట్టాన్ని సవరించాలి.
- ఉమ్మడి కార్యాచరణ కమిటీ పైన పేర్కొన్న నిబంధనలను అతిక్రమించి కేంద్ర ప్రభుత్వం పునర్విభజన ప్రయత్నాలు సాగిస్తే ఈ కమిటీలోని పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో సమష్టిగా ఎదుర్కొనేలా సహాయసహకారాలు అందించాలి.
- ఎంపీల కోర్ కమిటీ ఉమ్మడి కార్యాచరణ కమిటీ తీర్మానాన్ని ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలోనే ప్రధానికి సమర్పించాలి.

అసెంబ్లీలో తీర్మానాలు

ప్రస్తుత ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆయా రాష్ట్రాలలో పునర్విభజనను వ్యతిరేకిస్తూ శాసనసభలలో తీర్మానాలు చేయాలి. ఆతీర్మానం నకళ్లను కేంద్ర ప్రభుత్వానికి పంపాలి.

- పునర్విభజనపై ఆయా రాష్ట్రాలలోని ప్రజల మధ్య అవగాహన కల్పించే దిశగా ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమన్వయకమిటీ ద్వారా విస్తృతపచారం సాగిస్తుంది.

మరిన్ని వివరాలు 7వ పేజీలో...

ఎవరెవరు వచ్చారంటే..?

జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన శనివారం చెన్నైలోని ఓ హోటల్లో జరిగిన ఈ సమావేశానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ (సీపీఎం), తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి (కాంగ్రెస్), పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ (ఆమ్ ఆద్మీ), కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ (కాంగ్రెస్), బీఆర్ఎస్ కార్యాచరణ అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ నేతలు వినోద్‌కుమార్, సురేష్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, ఒడిశా మాజీ మంత్రి సంజయ్ కుమార్ దాస్ బుర్మా, అమర్ పట్నాయక్ సింగ్ (బీజేడీ), శిరోమణి అకాళిదళ్ అధ్యక్షుడు సర్దార్ బల్వీందర్ సింగ్, దల్జిత్‌సింగ్ సీమా, సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం, కాంగ్రెస్ కేరళ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాకరన్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎంఏ సలామ్, కేరళ రెవెల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడు ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్, ఆలిండియా మజ్లిస్-ఈ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ ప్రతినిధి ఇంతియాజ్ జలీల్, కేరళ కాంగ్రెస్ (మణి) ప్రతినిధి జోస్ కె.మణి, కేరళ కొట్టాయం కాంగ్రెస్ ఎంపీ జార్జి కె.ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు. బీజేడీ అధినేత, ఒడిస్సా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వీడియో సందేశం పంపించారు.

డీఎంకే సర్కారుకు వ్యతిరేకంగా
బీజేపీ ఆందోళనలు

● ఇంట్లో నల్ల జెండా ఎగరేసిన అన్నామలై

అడయార్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా ఏడు రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీల నేతలతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కీలక సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టింది. ఇందులో భాగంగా బీజేపీ శ్రేణులు తమ ఇళ్లపై నల్లజెండాలను ఎగురవేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై చెన్నైలోని తన నివాసంపై నల్లజెండాను ఎగురవేసి తన నిరసన తెలిపారు. 2026 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని లోక్‌సభ సీట్లను పునర్విభజన చేయాలని కేంద్రంలోని బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే సర్కారు భావిస్తోంది. ఇదే జరిగితే కుటుంబ నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య గణనీయంగా తగ్గిపోనుంది. దీన్ని దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీల నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా డీఎంకే అధినేత, సీఎం ఎంకే స్టాలిన్ ఈ విషయంపై తొలిసారి గళం విప్పారు. ఇందులోభాగంగా బీజేపీ పాలనేతర పార్టీల నేతలతో శనివారం నగరంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ చర్యను బీజేపీ రాష్ట్ర శాఖ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమావేశానికి నిరసన తెలుపుతూ ప్రతి కార్యకర్తా తమ గృహాలపై నల్లజెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఇందులోభాగంగా, బీజేపీ నేతలు తమ గృహాలపై నల్లజెండాలను ఎగురవేశారు. నగర శివారు ప్రాంతమైన పనైయూరులోని నివాసంపై రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.అన్నామలై, మాజీ గవర్నర్, బీజేపీ మహిళా నేత డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ కూడా సాలిగ్రామంలోని తన నివాసంపై నల్లజెండాను నల్లజెండాను ఎగురవేశారు. వీరితో పాటు పార్టీ ఉపాధ్యక్షుడు వీపీ దురైస్వామి, కరు నాగరాజన్, కార్యదర్శులు కరాటే త్యాగరాజన్, సతీష్‌కుమార్, విమల్‌చంద్, మీడియా విభాగ నేత ఏఎన్ఎస్ ప్రసాద్ తదితరులు నల్లజెండాలను ఎగురవేసి తమ నిరసన వ్యక్తం చేశారు.



ధర్నా చేస్తున్న అన్నామలై తదితరులు



ఆందోళనలో తమిళిసై తదితరులు

ఐపీఎల్ సందడి మొదలు

● నేడు చేపాక్కంలో సీఎస్‌కే - ముంబై ఇండియన్స్ ఢీ

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ పోటీల్లో ఆదివారం రాత్రి 7.30 గంటలకు స్థానిక చేపాక్కం ఎంఏ చిదంబరం స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ - ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. సీఎస్‌కే మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోని ఆడే చివరి సీజన్ అని ప్రచారం జరుగుతుండడంతో అభిమానులు పెద్దసంఖ్యలో మ్యాచ్ వీక్షించేందుకు తరలిరానున్నారు. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలు ఈనెల 19వ తేది ఆన్‌లైన్‌లో ప్రారంభమైన గంటలోపే ముగిసిన విషయం తెలిసిందే. మ్యాచ్ టిక్కెట్లు కొనుగోలు చేసిన అభిమానులు ఎంటీసీ బస్సులు, మెట్రో రైళ్లలో ఉచితంగా ప్రయాణించవచ్చని సీఎస్కే యాజమాన్యం ప్రకటించింది. మ్యాచ్ సందర్భంగా చెన్నై బీచ్-వేళచ్చేరి మధ్య పత్యేక ఎమ్మార్టీఎస్ రైళ్లు నడుపనున్నారు.





ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ కోచ్ కెవిన్ పొలార్డ్, ధోని - సిద్ధమవుతున్న చేపాక్కం మైదానం

జోరుగా జెర్సీల విక్రయాలు...

తమ అభిమాన క్రికెటర్, జట్టుతో కూడిన జెర్సీలు కొనుగోలుకు అభిమానులతో ప్రజలు కూడా ఆసక్తి చూపుతున్నారు. సీఎస్కే జట్టులో ధోని నెంబరుతో కూడిన '7' నెంబరు జెర్సీలు విక్రయాలు అధికంగా ఉన్నాయి. అలాగే, ముంబై ఇండియన్స్‌లో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా తదితరుల జెర్సీలు విక్రయాలు కూడా ఊపందుకున్నాయి. ఇక, రెండు జట్ల జెండాలు కూడా పెద్ద సంఖ్యలో అభిమానులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే, స్టేడియం సమీపంలో మ్యాచ్ జరిగే ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు మార్పు చేశారు. మ్యాచ్ ముగిసిన అనంతరం స్టేడియం నుంచి పలు ప్రాంతాలకు ఎంటీసీ ప్రత్యేక బస్సులు నడుపనుంది. స్టేడియం చుట్టుపక్కల ప్రాంతాల్లో సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్లు ఏర్పాటు చేసిన పోలీసులు బందోబస్తు పనులు చేపట్టారు.

చేపాక్కంలో ఏడు మ్యాచ్‌లు...

రాష్ట్ర జట్టుగా పేరుగాంచిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) చేపాక్కం మైదానంలో ఏడు మ్యాచ్‌లు ఆడనుంది. ముంబై (ఈనెల 23వ తేది), బెంగళూరు (ఈనెల 28న), ఢిల్లీ (ఏప్రిల్ 5న), కొల్‌కత్తా (ఏప్రిల్ 12న), హైదరాబాద్ (ఏప్రిల్ 25న), పంజాబ్ (ఏప్రిల్ 30న), రాజస్థాన్ (మే 12వ తేది) జట్లతో సీఎస్కేతో తలపడనుంది.

అనిరుధ్ సంగీత కచ్చేరి

చేపాక్కం క్రికెట్ మైదానంలో యువ సంగీత దర్శకుడు అనిరుధ్ పాట కచ్చేరి ఆదివారం జరగనుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టీ20 పోటీల్లో భాగంగా చేపాక్కం మైదానంలో ఆదివారం రాత్రి 7.30 గంటలకు చెన్నై సూపర్ కింగ్స్ - ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ వీక్షించే క్రికెట్ అభిమానులకు మరింత ఆహ్లాదం కలిగించేలా సాయంత్రం 6.30 నుంచి 6.50 గంటల వరకు అనిరుధ్ సంగీత కచ్చేరి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:26 (ఆదివారం సాయంత్రం) | సహర్: 4:31 (సోమవారం ఉదయం)

సమాచార ధ్వని

సెలవు రోజుల్లోనూ పనిచేయనున్న బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాలు

పెరంబూర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రాలు ఈ నెలలో సెలవు రోజుల్లోనూ పనిచేస్తాయని ఆ సంస్థ చెన్నై కార్యాలయం పేర్కొంది. వినియోగదారులు తమ ల్యాండ్ ఫోన్, బ్రాండ్ బ్యాండ్, సెల్‌ఫోన్ బిల్లులను ఈనెలలో సెలవు రోజులైన 23, 30, 31 తేదీల్లో సేవా కేంద్రాల్లో చెల్లించవచ్చు.

10 జిల్లాలకు వర్ష సూచన

ప్యారీస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వేగంగా వీస్తున్న గాలుల ప్రభావం కారణంగా ఆదివారం రాష్ట్రంలోని పలుజిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరించింది. చైనాపై వున్న దట్టమైన మేఘాలు బంగాళాఖాతంలో పయణిస్తు గాలులు వేగంగా వీస్తున్నాయని, వీటి ప్రభావం వల్ల రాష్ట్రంలోని కోయంబత్తూరు, కృష్ణగిరి, ధర్మపురి, ఈరోడ్, తిరునల్వేలి, తెన్‌కాశి, రామనాథపురం, కన్నియాకుమారి, తూత్తుకుడి, నీలగిరి జిల్లాల్లో ఆదివారం నుంచి రెండ్రోజుల పాటు మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. చెన్నైలో ఒక ట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. పది జిల్లాల్లో వానలతో పాటు, ఉరుములు, మెరుపులు కూడా వస్తాయని, బంగాళాఖాతంలో గాలివేగం గంటకు 30నుండి 40వరకు వుంటుందని వాతావరణశాఖ తెలిపింది.

ముస్లిం ఉద్యోగులకు ప్రత్యేక రాయితీ

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక విద్య డైరెక్టరేట్ పరిధిలోని అన్ని కార్యాలయాల్లో పనిచేసే ముస్లింలు, సాయంత్రం 4.30 గంటల అనంతరం కార్యాలయం నుంచి వెళ్లేందుకు అనుమతించారు. ఈ మేరకు అన్ని జిల్లా ప్రధాన విద్యాధికారులకు ప్రాథమిక విద్య డైరెక్టరేట్ జారీచేసిన సర్క్యులర్‌లో... జిల్లా విద్యా కార్యాలయాలు, తాలూకావిద్య కార్యాలయాల్లో పనిచేస్తున్న ముస్లింలు, రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ఈనెల 31వతేదివరకు ప్రతిరోజు సాయంత్రం 4.30 గంటలకు కార్యాలయం నుంచి వెళ్లేందుకు అనుమతించాలని,భోజన విరామ సమయానికి బదులు, కార్యాలయ వేళల్లో సా యంత్రం గంట ముందుగా ముస్లిం ఉద్యోగులు వెళ్లేందుకు అనుమతించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

25న బీజేపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో ఎగ్మూర్‌లో ఈనెల 25వ తేది సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, సీనియర్ నేతలు, కూటమి పార్టీల నేతలు పాల్గొననున్నారు. ఇఫ్తార్ విందులో పాల్గొనాలని కార్యక్రమ సమన్వయకర్త, బీజేపీ క్రీడలు, వృత్తి నైపుణ్య శిక్షణ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు అమర్ ప్రసాదరెడ్డి శుక్రవారం అన్నాడీఎంకే హక్కుల పునరుద్ధరణ కమిటీ నేత పన్నీర్‌సెల్వం, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి దినకరన్‌ను స్వయంగా కలసి ఆహ్వానించారు.

28న వాహనాల వేలం

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎక్సైజ్ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకున్న 78 వాహనాలను ఈ నెల 28వ తేది వేలం వేయనున్నారు. ఈ మేరకు ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... స్థానిక ఎగ్మూర్‌లోని రాజారత్తినం స్టేడియంలో ఉదయం 10 గంటలకు వాహనాలను బహిరంగ వేలం వేయనున్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు గుర్తింపు కార్డు, జీఎస్‌టీ నెంబరు తదితరాలతో రూ.1,000 ధరావతు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలి. వేలంలో వాహనాలు కొనుగోలు చేసిన వారు మరుసటిరోజు జీఎస్‌టీతో కలసి వేలం సొమ్ము చెల్లించాలని పోలీసుల శాఖ తెలిపింది.

3న మదురైలో రాష్ట్రాల హక్కుల పరిరక్షణ సదస్సు

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల హక్కుల పరిరక్షణ సదస్సు ఏప్రిల్ 3వ తేది మదురైలో జరుగుతుందని సీపీఎం రాష్ట్రకార్యదర్శి షణ్ముగం తెలిపారు. మదురైలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... సీపీఎం జాతీయ సభలు ఏప్రిల్ 2 నుంచి 6వ తేది వరకు మదురైలో జరగనున్నాయన్నారు. సభల్లో భాగంగా 6వ తేది కార్యకర్తలతో ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు. 3వ తేది మదురై తముక్కం మైదానంలో జరిగే రాష్ట్రాల హక్కుల పరిరక్షణ సదస్సులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరే గౌడ తదితరులు పాల్గొంటారని షణ్ముగం తెలిపారు.

మారిషస్ విమానంలో సాంకేతికలోపం

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కం నుంచి మారిషస్ వెళ్లే విమానంలో తలెత్తిన సాంకేతికలోపాన్ని సకాలంలో గుర్తించడంతో 227 మందికి పెనుప్రమాదం తప్పింది. మీనంబాక్కం నుంచి మారిషస్ రాజధాని పోర్ట్‌లూయిస్‌కు ఎయిర్ మారిషస్ విమానం 217 మంది ప్రయాణికులు, 10 మంది విమాన సిబ్బందితో సిద్ధంగా ఉంది. విమానం రన్‌వేపై వెళ్లేందుకు ముందుగా పైలెట్ తుది తనిఖీలు చేపట్టి, సాంకేతికలోపం ఉన్నట్లు గుర్తించి విమానాశ్రయ అధికారులకు తెలియజేశారు. అధికారులు, సాంకేతిక నిపుణులు రెండు గంటలు శ్రమించి సాంకేతికలోపం సరిచేయడంతో, 5.30 గంటలకు విమానం బయల్దేరి వెళ్లింది.

చెన్నై చేరుకున్న 11 మంది రామేశ్వరం జాలర్లు

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్ల నుంచి విడుదలైన 11 మంది రామేశ్వరం జాలర్లు శనివారం వేకువజామున విమానంలో చెన్నైకి చేరుకున్నారు. రామేశ్వరం నుంచి గత 2, 19, 23 తేదీల్లో ఫైబర్ పడవల్లో చేపల వేటకు వెళ్లిన 11 మంది జాలర్లను సరిహద్దులు దాటారంటూ అరెస్ట్ చేసిన శ్రీలంక నావికాదళం, మూడు పడవలు కూడా స్వాధీనం చేసుకుంది. అరెస్ట్ చేసిన జాలర్లను విడుదల చేయాలంటూ శ్రీలంక కోర్టు ఉత్తర్వులు జారీచేయడంతో, జాలర్లను శ్రీలంకలోని భారత దౌత్య కార్యాలయంలో అప్పగించారు. జాలర్ల వద్ద పాస్‌పోర్ట్ లేకపోవడంతో వారిని విమానంలో తీసుకురాలేని పరిస్థితులు నెలకొన్నాయి. జాలర్లకు అత్యవసర సర్టిఫికెట్ అందజేయడంతో పాటు విమాన టిక్కెట్లను భారత దౌత్య కార్యాలయం ఏర్పాటుచేసింది. దీంతో, కొలంబో నుంచి శుక్రవారం రాత్రి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో బయల్దేరిన జాలర్లు చెన్నైకి చేరుకున్నారు. వారిని ఆహ్వానించిన మత్స్యశాఖ అధికారులు, వాహనాల్లో స్వగ్రామాలకు పంపించారు.

కాంచీపురం పెరుమాళ్ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ధ్వజారోహణం పూజలు నిర్వహిస్తున్న ఆలయ పూజారులు

ప్యారీస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరంగా ప్రసిద్ధిచెందిన కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయంలో పంగుణి నెల బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణం పూజలతో ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. 108 వైష్ణవ దివ్యదేశాల్లో సత్యవ్రత క్షేత్రంగా గుర్తింపు పొందిన అమృతవల్లి తాయార్ సమేత పెరుమాళ్ ఆలయం బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక అంశాలతో ముస్తాబైంది. శనివారం ఉదయం 6 గంటలకు స్వామివారికి ప్రత్యేక అభిషేక, ఆరాధనలు నిర్వహించి, పచ్చ రంగు పట్టువస్త్రం, దివ్యాభరణాలు, రకరకాల పూలతో అలంకరించారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజాలు, ధూప, దీప ఆరాధనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గరుడాళ్వార్ పతాకాన్ని వేదమంత్రోచ్చారణలు, మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య ధ్వజస్తంభంపై ఆవిష్కరించి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా తొలిరోజు ఉత్సవంలో శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారిని పల్లకీలో పురవీధుల్లో ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గరుడోత్సవం 24వ తేది సోమవారం జరుగుతుందని ఆలయ నిర్వహకులు తెలిపారు.

రసాయనాలు కలిపిన పుచ్చకాయల స్వాధీనం


పుచ్చకాయలను స్వాధీనం చేసుకుంటున్న ఆహార భద్రతా శాఖ అధికారులు

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వళ్లువర్‌కోట్టంలో 1,500 కిలోల రసాయనాలు కలిపిన పుచ్చకాయలను ఆహార భద్రతా శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎండలు మండిపోతుండడంతో తాగునీరు, కొబ్బరి నీళ్లు, పుచ్చకాయలు, జ్యూస్ తదితరాల వినియోగం పెరిగింది. ప్రజల అవసరాలు సొమ్ము చేసుకొనేలా పలువురు నాణ్యత లేని తాగునీరు, రసాయనాలు కలిపిన పుచ్చకాయలను విక్రయిస్తున్నట్లు ఆహార భద్రతా శాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో, వళ్లువర్‌కోట్టం సమీపంలోని రోడ్ల పక్కనే విక్రయిస్తున్న పుచ్చకాయలను శుక్రవారం ఆహార భద్రతా శాఖ అధికారి సతీష్‌కుమార్ నేతృత్వంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ విషయమై సతీష్‌కుమార్ మాట్లాడుతూ... రసాయనాలు కలిపిన పుచ్చకాయలు సాధారణం కన్నా అధిక ఎరుపు రంగులో కనిపిస్తాయన్నారు. ఇలాంటి పుచ్చకాయలను తెలుసుకోవాలంటే టిష్యూ పేపరుతో తాకితే ఎరుపు రంగు అంటుకుంటే ఉంటే రసాయనాలు కలిపినదిగా తెలుసుకోవచ్చన్నారు. అలాగే, రుచి కోసం చక్కెరతో కలసిన రసాయనం కలుపుతారని, సిరంజిల ద్వారా ఈ రసాయనాలు పండ్లలోకి ఎక్కిస్తారని తెలిపారు. ఇలాంటివి తింటే పలు వ్యాధులకు గురికావాల్సి వస్తుందని ఆయన తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులు

- నిందితుడికి 10 ఏళ్ల జైలు

ప్యారీస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు(23)కు న్యాయస్థానం పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. నగరానికి వలసవచ్చిన కార్మికుల్లో పలువురు కూలీ పనులు, మరికొంతమంది సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిలో ఓ యువకుడు 13ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి, ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. యువకుడిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన విచారణ మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలోని పోక్సో ప్రత్యేక కోర్టులో ముగిసిన నేపథ్యంలో శుక్రవారం తీర్పు వెలువడింది. ఇందులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలను బస్సులో పంపించిన మంత్రి శివశంకర్


ఎమ్మెల్యేలతో మంత్రి శివశంకర్

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల డిమాండ్లను పరిష్కరించేలా, ఆలస్యం లేకుండా బస్సులను శాసనసభ ప్రాంగణానికి రప్పించిన రవాణా శాఖ మంత్రి శివశంకర్, దగ్గరుండి ఎమ్మెల్యేలను బస్సులో ఎక్కించి పంపించారు. శాసనసభ సమావేశాల్లో శుక్రవారం నీలగిరి జిల్లా గూడలూరు అన్నాడీఎంకే ఎమ్మెల్యే జయశీలన్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశం ముగిసిన తరువాత ఎమ్మెల్యే విడిది గృహానికి తీసుకెళ్లే బస్సులు ఆలస్యంగా వస్తున్నాయని తెలిపారు. గురువారం కూడా అరగంట ఆలస్యంగా బస్సులు రావడంతో ఎండలో ఇబ్బంది పడ్డామన్నారు. అందువల్ల సమావేశం ముగిసే 2 నిమిషాలకు ముందుగా బస్సులను ప్రాంగణంలో నిలిపేలా చర్యలు చేపట్టాలని కోరారు. అందుకు మంత్రి శివశంకర్ సమాధానమిస్తూ... సమావేశం ముగిసిన తర్వాత అన్ని కార్లు ఒకేసారి రావడంతో రద్దీలో బస్సులు చిక్కుకోవడంతో ఆలస్యమవుతోందని వివరించారు. ఈరోజు సమావేశం ముగిశాక తానే దగ్గరుండి సకాలంలో సభ్యులను బస్సులో పంపుతానని మంత్రి హామీ ఇచ్చారు. ఆ ప్రకారం, సమావేశం ముగియడానికి ముందే బస్సులు ప్రాంగణంలో సిద్ధంగా ఉంచి, ప్రతిపక్ష ఉపనేత ఆర్పీ ఉదయకుమార్, సమస్య తెలిపిన ఎమ్మెల్యే జయశీలన్ సహా సభ్యులను బస్సులో పంపించారు. ఇక నుంచి ఆలస్యం లేకుండా బస్సులు నిలుపుతామని మంత్రి ప్రతిపక్ష సభ్యులకు తెలియజేశారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

తిరుత్తణి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని ఇట్చిపుత్తూరులో డాన్‌బాస్కో కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాల నిర్వాహణలోని పాఠశాలలో ప్రపంచ అటవీ, జల దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వ్యవసాయం, అటవీ సంరక్షణపై ఒకటో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల చైర్మన్ సిస్టర్ లిడియా ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్ సహాయరాజ్, డాక్టర్ సురేష్‌వర్మ, డాక్టర్ శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముల్లైపెరియార్ డ్యాం పరిశీలన


డ్యాం వద్ద జాతీయ ఆనకట్టల పరిరక్షణ కమిషన్ చైర్మన్, సభ్యులు

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆనకట్టల పరిరక్షణ కమిషన్ ఏర్పాటు చేసిన తర్వాత తొలిసారిగా ఈ కమిషన్ సభ్యులు శనివారం ఉదయం ముల్లైపెరియార్ డ్యాంను పరిశీలించారు. ముల్లైపెరియార్ డ్యాంలో 142 అడుగుల నీటిని నిల్వ చేసుకోవచ్చని, బేబీ డ్యాంను పటిష్ఠం చేసిన తర్వాత 152 అడుగులకు పెంచవచ్చని 2014లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అయితే బేబీ డ్యాం పటిష్ఠతకు కేరళ ప్రభుత్వం అడ్డుపడుతోంది. 2024 అక్టోబరు 1వ తేది నుంచి ఈ డ్యాం జాతీయ ఆనకట్టల పరిరక్షణ కమిషన్ ఆధీనంలోకి వచ్చింది. కమిషన్ చైర్మన్ అనిల్‌జైన్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. ఈ బృందం తొలిసారిగా ముల్లైపెరియార్ డ్యాంను పరిశీలించింది. అనిల్ జైన్ నేతృత్వంలో రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి మంగత్‌రామ్‌శర్మ, కావేరి టెక్నికల్ కమిటీ చైర్మన్ సుబ్రమణియన్, కేరళ ప్రభుత్వ అదనపు చీఫ్ సెక్రటరీ విశ్వాస్, జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్, సాంకేతిక నిపుణులు ముల్లైపెరియార్ మెయిన్ డ్యాం, బేబీ డ్యాం, షైనింగ్ ఏరియా, నీటి కాలువలు, తూములు తదితరాలను పరిశీలించారు. అనంతరం ఇరు రాష్ట్రాల అధికారులతో ముల్లైపెరియార్ డ్యాం పటిష్ఠత, పర్యవేక్షణ సహా అంశాలపై కమిషన్ సభ్యులు చర్చించారు. నివేదికను సుప్రీంకోర్టులో దాఖలు చేయనున్నట్లు కమిషన్ సభ్యులు తెలిపారు.

ఘనంగా శ్రీబాలాజీ వైద్య కళాశాల స్నాతకోత్సవం



ఓ విద్యార్థినికి పట్టాను ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ మహమ్మద్ రేలా

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన శ్రీబాలాజీ వైద్యకళాశాల ఆస్పత్రి 16వ స్నాతకోత్సవం శనివారం ఉదయం ఘనంగా జరిగింది. యూజీ, పీజీకి చెందిన 860 మంది విద్యార్థులు పట్టాలు, పతకాలు అందుకున్నారు. ఈ స్నాతకోత్సవానికి మారిషస్ మాజీ ఉపాధ్యక్షుడు పరమశివం పిళ్లై వయాపురి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ ఎస్. జగద్రక్షగన్, భారత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ ఛాన్సలర్ డాక్టర్ మహమ్మద్ రేలా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం. సుందరరాజన్, శ్రీబాలాజీ వైద్య కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ జె.శ్రీనిషా, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ఇలమారన్, రిజిస్ట్రార్ ఎస్. భూమినాథన్, డీన్ డాక్టర్ పి. శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'జైగోమా' చికిత్సలో రాజన్ డెంటల్ సరికొత్త మైలురాయి


కార్యక్రమంలో నిర్వాహకులు

అడయార్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ది చెన్నై ఇనిస్టిట్యూట్ రీసెర్చ్ ఫౌండేషన్ (సీడీఆర్ఎఫ్) సహకారంతో రాజన్ డెంటల్ ఇనిస్టిట్యూట్ 'జైగోమా చికిత్సలో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఈ ఇనిస్టిట్యూట్ జైగోమా విధానంలో వెయ్యి చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసింది. స్పెషల్ జైగోమా డెంటల్ ఇంప్లిమెంట్స్‌లో విజయవంతంగా వెయ్యి మార్కును అధిగమించింది. ఈ సందర్భంగా ది జైగోమా ఇంప్లాంట్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు గౌతమానంద మహరాజ్, రాజన్ డెంటల్ ఇనిస్టిట్యూట్ మెడికల్ డైరెక్టర్ గుణశీలన్ రాజన్, రాజన్ డెంటల్ ఇనిస్టిట్యూట్ సీఈవో డాక్టర్ ఎస్.జిమ్మన్‌తో పాటు చెన్నై డెంటర్ రీసెర్చ్ ఫౌండేషన్ సీడీఆర్ఎఫ్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గుణశీలన్ మాట్లాడుతూ, 'పై దవడలో తీవ్రమైన ఎముక నష్టం ఉన్న రోగులకు జైగోమా ఇంప్లాంట్ ఒక విప్లవాత్మక చికిత్స అని, ఇది సంప్రదాయ దంత ఇంప్లాంట్లు పొందలేని వారికి జీవితాన్ని మార్చే సరికొత్త ప్రయత్నమని వెల్లడించారు.

18 మంది చిన్నారులకు విమాన విహార యాత్ర

సొంత ఖర్చులతో కోరిక నెరవేర్చిన హెడ్మాస్టర్


విమానంలో తూత్తుకుడి చేరిన చిన్నారులతో నెల్సన్ పొన్‌రాజ్

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి సమీపం పండారంపట్టిలోని ప్రభుత్వ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెల్సన్ పొన్‌రాజ్ తన స్వంత ఖర్చులతో విమానంలో విహరింపజేసి స్థానికుల ప్రశంసలందుకున్నారు. ఆ పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు తన సంపాదనలో అధిక భాగాన్ని ఖర్చుచేశారు. ఈ నేపథ్యంలో ఓ రోజు పాఠం చెబుతుండగా ఓ చిన్నారి విమానంలో ప్రయాణించాలని తనకు ఆశగా ఉందని, తన కోరిక నెరవేరుతుందా అని ఆయనను ప్రశ్నించింది. ఆ విషయాన్ని గుర్తుంచుకుని నెల్సన్ పొన్‌రాజ్ స్కూలులో చదువుతున్న 18 మంది బాలబాలికలను విమానంలో చెన్నైకి తీసుకెళ్లేందుకు మూడు నెలలకు ముందే తన సొంత ఖర్చుతో టికెట్లు బుక్ చేశారు. శనివారం ఉదయం ఆ బాలబాలికలను తూత్తుకుడి నుండి చెన్నై దాకా విమానంలో తీసుకెళ్లి వారిని సంతోషపెట్టారు. తూత్తుకుడికి ఆ చిన్నారులతో తిరిగొచ్చిన హెడ్మాస్టర్ నెల్సన్ పొన్‌రాజ్‌కు స్థానికులు స్వాగతం పలికి పిల్లల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

తిరువలంగాడులో విద్యార్థి హత్య

నిందితుడి సహా ఇద్దరి అరెస్ట్


నిందితుడు జగన్

తిరుత్తణి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరుజిల్లా తిరువలంగాడులోని నత్తవాడ గ్రామంలో లోకేష్ (19)అనే విద్యార్థిపై గురువారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేసి హత్య చేసిన సంఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. రంగంలోకి దిగిన జిల్లా పోలీస్ సుపరింటెండెంట్ శ్రీనివాసపెరుమాళ్ నేతృత్వంలోని బృందం 24 గంటల్లోనే మృతుడు లోకేష్ సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలను ఛేదించి, హంతకులను అరెస్టు చేశారు. పోలీసు విచారణలో మృతుడు లోకేష్ స్నేహితులే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలిసింది. నత్తవాడ గ్రామానికి చెందిన లోకేష్ మిత్రుడు జగన్(21), మరో ఇద్దరు విద్యార్థులు కలిసి గురువారం రాత్రి సమయంలో మద్యం తాగడానికి పిలిపించి, ఆ తరువాత లోకేష్ ఒంటిపై 15 సార్లు కత్తితో పొడిచి హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. లోకేష్‌ను హత్య చేయడానికి గల కారణాలు ఇంకా తెలియాల్సివుంది. పోలీసులు నిందితుడు జగన్‌తో సహా ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చెంగల్పట్టు జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు వారెంట్

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోర్టు ధిక్కరణ కేసులో విచారణకు హాజరుకాని చెంగల్పట్టు జిల్లా కలెక్టర్‌పై హైకోర్టు వారెంట్ జారీ చేసింది. మదురాంతకం తాలూకా అనైకుంద్రం గ్రామ సహాయకుడిగా ఉన్న మునుస్వామి 2001లో మృతిచెందాడు. కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగం కల్పించాలని మునుస్వామి కుమారుడు రాజగిరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని విచారించిన హైకోర్టు... కారుణ్య ప్రాతిపదికన రాజగిరికి మూడు నెలల్లో ఉద్యోగం ఇవ్వాలని 2023లో ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు అమలు చేయలేదని రాజగిరి, 2024లో కోరు ధిక్కార కేసు దాఖలుచేశారు. ఈ కేసు విచారణకు స్వయంగా హజరుకావాలని చెంగల్పట్టు కలెక్టర్‌కు న్యాయమూర్తి ఎంఎస్ రమేష్ నోటీసులు జారీ చేశారు. ఈ కేసు తిరిగి విచారణకు రాగా కలెక్టర్ హాజరుకాకపోవడంతో బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన న్యాయమూర్తి, తదుపరి విచారణ ఏప్రిల్ 4వ తేదీకి వాయిదావేశారు.

ఏఐ అప్‌గ్రేడ్‌తో కంప్యూటర్ సిలబస్


సదస్సులో డాక్టర్ ఎస్.కన్నప్పన్ తదితరులు

అడయార్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ అప్‌గ్రేడ్ చేసిన కంప్యూటర్ సిలబస్ సిద్ధంగా ఉందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కన్నప్పన్ తెలిపారు. శనివారం స్థానిక పోరూర్‌లోని శ్రీరామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగం పాఠశాల కోసం ఏఐ టెక్నాలజీ అనే పేరుతో సదస్సును నిర్వహించింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్.కన్నప్పన్ మాట్లాడుతూ... ఈ నెలాఖరులోగా 8 వేలకు పైగా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలకు పది కంప్యూటర్లతో కూడిన హైటెక్ ల్యాబ్‌లు అందుబాటులోకి వస్తాయన్నారు. 22,931 ప్రాథమిక పాఠశాలల్లో కూడా స్మార్ట్ క్లాస్ రూంలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కంప్యూటర్లు, కృత్రిమ మేథస్సు వాడకంలో ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇవ్వడమే ఇపుడు ప్రధాన ఛాలెంజ్‌గా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర ఇనిస్టిట్యూట్ అధ్యాపకులతో పాటు 60కి పైగా పాఠశాలల నుంచి 90 మందికిపైగా ప్రిన్సిపాళ్ళు, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావోయిస్టు ఆచూకీ చెబితే రూ.2 లక్షల బహుమతి

ఎన్ఐఏ పోస్టర్లు

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల ఆచూకీ చెబితే రూ2 లక్షల బహుమతి అందజేయనున్నట్లు ఎన్ఐఏ రాష్ట్రంలో పోస్టర్లు అటించింది. కేరళ రాష్ట్రం ఎడక్కర పోలీస్‌స్టేషన్‌లో 2021లో మావోయిస్టులు కార్తిక్, షర్మిల, సంతోష్‌కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అజ్ఞాతంలోకి వెళ్లిన ఈ ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్న నేపథ్యంలో, ఈ కేసు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు బదిలీ చేశారు. వీరిని అరెస్ట్ చేయాలంటూ ఇటీవల కోర్టు వారెంట్ జారీ చేసింది. దీంతో, కేరళతో పాటు రాష్ట్రంలో కూడా ముగ్గురి ఫొటోలతో పోస్టర్లు ముద్రించారు. కోయంబత్తూర్ బస్టాండ్, రైల్వే స్టేషన్ సహా పలు ప్రాంతాల్లో ముగ్గురు మావోయిస్టులు ఫొటోలు వేసి, వారి ఆచూకీ తెలిపితే తలా రూ.2 లక్షలు బహుమతిగా అందిస్తామని, ఆచూకీ తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎన్ఐఏ పోస్టర్లలో ముద్రించింది.

రైల్వే ఉద్యోగాల పేరుతో మోసం

ఇద్దరు ఆర్పీఎఫ్‌లు సహా ఐదుగురికి నాలుగేళ్ల జైలు

ప్యారీస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగ అవకాశాలు ఇప్పిస్తామని పలువురిని నమ్మించి పెద్దమొత్తం నగదు పుచ్చుకుని మోసం చేసిన ఇద్దరు ఆర్పీఎఫ్‌లు సహా ఐదుగురికి హైకోర్టు మదురై బెంచ్ నాలుగేళ్ళ జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. మదురైకు చెందిన జి.సెంథిల్‌కుమార్, ఆర్.కాళిదాస్, తంగం, ఆర్పీఎఫ్‌కు చెందిన ఆర్.భాస్కరన్, జాయ్‌సన్ అనే ఐదుగురు నిరుద్యోగ యువకులకు గాలంవేసి, ఆర్పీఎఫ్ దళంలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి పలువురి వద్ద రూ.లక్షలు నగదు పుచ్చుకున్నారు. అనంతరం హాల్‌టిక్కెట్, రాతపరీక్షలకు సంబంధించి ఆర్పీఎఫ్ తరుపున నకిలీ లేఖ సృష్టించారు. అదేవిధంగా ఉద్యోగాలకు సంబంధించిన ఉత్తర్వులను కూడా నకిలీవి సృష్టించినట్లు సీబీఐ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన మదురై అడిషినల్ జిల్లా కోర్టు మోసం చేసినట్లు తగిన ఆధారాలు సమర్పించలేదని కారణం చూపి, ఆ ఐదుగురిపై నమోదైన కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీనిని వ్యతిరేకిస్తూ సీబీఐ తరుపున హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి కేకే రామచంద్రన్ విచారణ జరిపారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసినట్లు ఆధారాలు ఉండటంతో ఆ ఐదుగురి నిందితులకు నాలుగేళ్ళ జైలుశిక్ష, తలా రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

కోవైలో ఇంటర్నేషనల్ హాకీ స్టేడియం

నేడు శంకుస్థాపన

అడయార్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు కార్పొరేషన్ నిధులతో ఆర్ఎస్ పురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక హాకీ స్టేడియం నిర్మితంకానుంది. దీని నిర్మాణం కోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. కార్పొరేషన్ నిధులతో మొత్తం 6500 చదరపుఅడుగుల విస్తీర్ణంలో ఆరు నెలల్లో ఈ స్టేడియం నిర్మాణం పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ మైదానంలో కృత్రిమ టర్ఫ్, గ్యాలరీ, మరుగుదొడ్లు, డ్రెస్సింగ్ రూం, తాగునీరు, వాహన పార్కింగ్ సదుపాయం వంటి వసతులను అంతర్జాతీయ ప్రమాణాలతో సమకూర్చనున్నారు.

మధుమేహులకు పాద సంరక్షణపై అవగాహన అవసరం

డాక్టర్ ఫ్రాన్సిస్ గేమ్



డాక్టర్ ఫ్రాన్సిస్‌గేమ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మధుమేహ బాధితులు తమ పాదాల సంరక్షణపై అప్రమత్తతో వ్యవహరించాలని ఇంగ్లాండ్‌లోని ఎన్‌హెచ్ఎస్ ఫౌండేషన్ ట్రస్టుకు చెందిన యూనివర్శిటీ హాస్పిటల్స్ ఆఫ్ డెర్బీ అండ్ బర్టన్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస గేమ్ పిలుపునిచ్చారు. మధుమేహ బాధితుల పాదాలలో వేళ్లకు గాయం తగిలి ఆరకపోయినా, వ్రణాలు ఏర్పడినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలని, లేకుంటే పాదాలను పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందన్నారు. స్థానిక తేనాంపేటలోని స్టార్‌హోటల్‌లో శనివారం మధ్యాహ్నం జరిగిన సభలో ఆమె 'ఎంవీ డయాబెటిస్, ప్రొఫెసర్ ఎం.విశ్వనాథన్ డయాబెటిస్ రిసెర్చి సెంటర్ స్వర్ణపతక స్మారకోపన్యాసం' చేశారు. తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే.నారాయణసామి, ఎంవీ డయాబెటిస్ సంస్థ అధినేత డాక్టర్ విజయ్ విశ్వనాథన్, డీన్ డాక్టర్ ఎన్ఎస్ నరసింహన్, అసోసియేట్ డీన్ డాక్టర్ జయశ్రీగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయసమ్మతమైన పునర్విభజనే మా ఆశయం

- సీఎం స్టాలిన్ డిమాండ్
- జనగణనకు ముందే పునర్విభజనా: పినరాయ్
- ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల యుద్ధం కాదు : కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్
- జేఏసీ సమావేశంలో గళమెత్తిన నేతలు



సమావేశానికి ముందు స్టాలిన్‌తో భేటీ అయిన వివిధ రాష్ట్రాల నేతలు

చెన్నై, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు తాము వ్యతిరేకం కాదని, అదే సమయంలో ఆ విభజన సర్వజనామోదంగా, న్యాయసమ్మతంగా ఉండాలనేదే తమ అభిమతమని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తాజా జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ శనివారం చెన్నైలో జరిగిన ఏడు రాష్ట్రాల రాజకీయ పార్టీల నేతలు, తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కర్ణాటక డిప్యూటీ సీఎం పాల్గొన్న ఉమ్మడి కార్యాచరణ కమిటీ రూపొందించేందుకు ఏర్పాటైన సమావేశంలో ఆయన ప్రసంగించారు. దేశ చరిత్రలో ఓ రాష్ట్రానికి చెందిన అధికార పార్టీ ఆహ్వానాన్ని అంగీకరించి ఇన్ని రాజకీయ పార్టీల నేతలు సమావేశనికి విచ్చేయడం ఆనందంగా ఉందని, ప్రజాస్వామ్య పరిరక్షణకోసమే అందరూ సమావేశమైనట్లు భారతజాతికి ఎలుగెత్తి చాటుతున్నామన్నారు. భారత ప్రజాస్వామ్యం, ఫెడరల్ రాజ్యాంగ విధానాన్ని పరిరక్షంచడం కోసమే ఐకమత్యాన్ని చాటేలా సమావేశమయ్యామని, విభిన్న సంస్కృతులు, ప్రత్యేకతలు కలిగిన, వివిధ భాషలు మాట్లాడుతున్న రాష్ట్రాలు భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటేలా ఉంటేనే ఫెడరల్ రాజ్యాంగం మనగలుగుతుందని, అప్పుడే ఆ రాష్ట్రాలు అబివృద్ధి చెందగలవన్నారు. అన్నివర్గాల ప్రజలు, పార్టీలు కలసికట్టుగా పోరాడినందువల్లే స్వాతంత్ర్యం సంపాదించామని, ఇదే తరహాలో నేటి సమావేశం చారిత్రక ఘట్టంగా భావిస్తున్నామని చెప్పారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరగటం వల్ల పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం కోల్పోతామన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్రాలన్నీ జనాభాను సమర్థవంతంగా నియంత్రించినందుకు పునర్విభజన పేరుతో కేంద్రం శిక్షించనున్నదనే ఆందోళనను కలిగి ఉంటున్నారని తెలిపారు.. రెండేళ్లుగా మణిపూర్‌లో క్లిష్టపరిస్థితులు కొనసాగుతున్నాయని, ఆ రాష్ట్ర ప్రజల బాగోగులను కేంద్రం విస్మరించిందని, అలాంటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను రాజకీయపరంగా బలహీనపరిచేందుకే నియోజకవర్గాల పునర్విభజనను అమలు చేయనుందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజనను ఆషామాషీగా తీసుకోకూడదని, దక్షిణాది రాష్ట్రాల హక్కులు, ఆ రాష్ట్రాల భవిష్యత్తుతో ముడిపడిన అత్యంత కీలకమైన అంశంగా పరిగణించాలన్నారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను (543) యదాతథంగా ఉంచి పునర్విభజన జరిగితే తమ రాష్ట్రంలో 8 ఎంపీ సీట్లు, ఒకే వేళ ఎంపీల సంఖ్యను (ఎనిమిదివందలకు పైగా) పెంచినా 12 ఎంపీ సీట్లను కోల్పోయే ప్రమాదముందని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించినమీదటే అఖిపక్ష సమావేశం జరిపి పునర్విభజన వల్ల నష్టపోనున్న రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీలు వంటి బలహీన వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, నియోజకవర్గాల సంఖ్య తగ్గిస్తే స్వదేశంలోనే రాజకీయ అధికారాలు లేని బానిసలుగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు.

చావుదెబ్బగానే భావించాలి...

నియోజకవర్గాల పునర్విభజన రాజకీయ ప్రాధాన్యతపై జరుగనున్న చావుదెబ్బగానే భావించాల్సి ఉంటుందన్నారు. దక్షిణాది రాష్ట్రాలకున్న హక్కులను పరిరక్షించడం కోసం, పునర్విభజనవల్ల కలిగే నష్టాలపై ప్రజలలో అవగాహన కల్పించడం కోసం ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. పునర్విభజనకు వ్యతిరేకంగా రాజకీయ పరమైన నిరసనను చట్ట ప్రకారం తెలియజేయడానికి గల మార్గాలను అన్వేషించడానికి ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కూడా తాను ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. ఐకమత్యంగా పోరాడితేనే విజయం సాధించగలమన్నారు. ఇంకా ఈ సమావేశంలో కొంతమంది ముఖ్య నేతలు వెల్లడించిన అభిప్రాయాలు వారి మాటల్లోనే...

జనగణనతో పునర్విభజన తగదు

జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన గర్హనీయం. దేశాభివృద్ధిని కాంక్షిస్తూ మనమంతా రాష్ట్రాలలోని జనాభాను సమర్థవంతంగా నియంత్రించగలిగాం. జనాభాను నియంత్రించి ఉండకపోతే జనాభా అధికమై దేశాభివృద్ధి కుంటుపడి ఉండేది. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిథ్యాన్ని కాపాడుకునే దిశగా ఏర్పాటైన ఈ సమావేశం దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్‌ను కాపాడితీరుతుందనే నమ్మకం నాకుంది. జనాభా ఆధారంగా పునర్విభజన యోచనను మానుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాను.

- ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్




జనగణనకు ముందే పునర్విభజనా?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మళ్లీ ఆంగ్లేయ పాలనను తలపించే రీతిలో నిరంకుశాధికారం దిశగా అడుగులు వేస్తోంది. జనగణను చేపట్టకముందే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పునర్విభజనపై చేసిన ప్రకటన అస్పష్టంగా ఉంది. పునర్విభజన వల్ల ఉత్తరాది రాష్ట్రాలే లాభపడతాయనే ఉద్దేశంతోనే కేంద్రం పునర్విభజనను చేయడానికి తొందరపడుతోంది. కేంద్రం ఓ వైపు జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలను పొగడుతూనే మరో వైపు ఆ రాష్ట్రాల ప్రజాప్రతినిధుల సంఖ్యను తగ్గించేందుకు కుట్ర పన్నుతోంది. అనువైన సమయంలో ఈ సమావేశం ఏర్పాటు చేసిన సోదరుడు స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

- కేరళ సీఎం పినరాయ్ విజయన్

ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల యుద్ధం కాదు



'ఫెడరల్ రాజ్యాంగ భవనం ఇటుకలను తొలగించి ప్రజాస్వామ్యాన్ని కుప్పకూల్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.పునర్విభజనను వ్యతిరేకించడాన్ని ఉత్తరాది రాష్ట్రాలు, దక్షిణాది రాష్ట్రాలకు మధ్య జరుగనున్న యుద్ధంగా ఎవరూ అపోహ పడకూడదు. ప్రజాస్వామ్యాన్ని, దక్షిణాది రాష్ట్రాల ప్రజాప్రతినిదుల సంఖ్యను కాపాడుకునేందుకే అందరమూ సమావేశమయ్యాం. న్యాయపరమైన, పారదర్శక మైన పునర్విభజననే కోరుకుంటున్నాం.

- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

ఆమ్ ఆద్మీ వందశాతం మద్దతు



దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాలను తగ్గించే దిశగా కేంద్రం చేపట్టనున్న పునర్విభజనను ఆమ్ ఆద్మీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.జనాభాను సమర్థవంతంగా నియంత్రించిన రాష్ట్రాలకు పునర్విభజన పేరుతో కేంద్రం శిక్షించడం భావ్యం కాదు. స్టాలిన్ నాయకత్వంలో రూపుదిద్దుకున్న ఉమ్మడి కార్యాచరణ కమిటీ భవిష్యత్ కార్యాచరణ లన్నింటికీ తమ పార్టీ వంద శాతం మద్దతిచ్చి అన్నివిధాలా సహకరిస్తుంది. ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.

- పంజాబ్ సీఎం భగవంత్‌సింగ్ మాన్

డీఎంకేతో కలిసి అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొంటాం

- ఎంఎన్‌ఎం సర్వసభ్య సమావేశంలో కమల్



కమల్‌తో పార్టీ నేతలు

ప్యారీస్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగబోయే ఎన్నికలను డీఎంకేతో కలిసి ఎదుర్కొంటామని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు, ప్రముఖ సినీనటుడు కమలహాసన్ ప్రకటించారు. స్థానిక ఆళ్వార్‌పేటలోని ఎంఎన్‌ఎం ప్రధాన కార్యాలయంలో శనివారం ఉదయం కమల్ అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో ఉపాధ్యక్షుడు ఏజీ మౌర్య, ఆర్.తంగవేల్, ప్రధాన కార్యదర్శి ఎ.అరుణాచలం, సర్వసభ్య మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమై, మధ్యాహ్నం 1.15 గంటల వరకు కొనసాగింది. ఈ సమావేశంలో 2026 అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు పనులు, బూత్ కమిటీల నియామకం, పార్టీ తరుపున ప్రజలను ఆకట్టుకునే రీతిలో చేపట్టాల్సిన ప్రచారయుక్తి, కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి ఓట్లు అభ్యర్థించడం తదితర అంశాల గురించి కమల్‌హాసన్ పార్టీ నిర్వాహకులతో చర్చించారు. సమావేశం ఆమోదించిన తీర్మానాలను కమల్ మీడియాకు వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి పార్టీ గొంతుకను అసెంబ్లీలో వినిపించడమే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. డీఎంకేతో కలిసి అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కొంటామని, కూటమి పార్టీలకు మద్దతుగా తాను ప్రచారంలో కూడా పాల్గొంటానని ఆయన తెలిపారు. పార్టీలో రాష్ట్ర, మండల, జిల్లాస్థాయి నిర్వాహకులను నియమించినట్లు కమల్ చెప్పారు. అదేవిధంగా మహిళా విభాగం నిర్వాహకులను కూడా ఎంపిక చేసి, వారికి పార్టీ బాధ్యతలు అప్పజెప్పినట్లు కమలహాసన్ తెలిపారు.

వాటర్ క్యాన్‌ను 30 సార్లు మాత్రమే రీఫిల్ చేయాలి

- ఆరోగ్య భద్రతా శాఖ

పెరంబూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తాగునీటి క్యాన్లను 30 సార్లు మాత్రమే రీఫిల్ చేయాలని తాగునీటి తయారీ కంపెనీలను ఆహార భద్రతా శాఖ అధికారులు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆహార భద్రత, మందుల నిర్వహణ విభాగం శుక్రవారం స్థానిక రిప్పన్ భవనంలో తాగునీటి తయారీ కంపెనీల యజమానులతో సమావేశమైంది. సమావేశంలో ఆహార భద్రతా శాఖ అధికారి సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. తాగునీటి తయారీ సంస్థలు వినియోగిస్తున్న తాగునీటి తొట్టెలు అధికంగా పాచితో కనిపిస్తున్నాయని, వీటిని సక్రమంగా శుభ్రం చేయాలన్నారు. లైసెన్స్ గడువు ముగిస్తే ప్రతిరోజు రూ.100 జరిమానా విధిస్తామన్నారు. ఉదాహరణకు 2 నెలలు లైసెన్స్ రెన్యువల్ చేసుకోకుంటే రూ.6 వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అదే విధంగా, తాగునీటి క్యాన్లు ఎక్కువగా ఉపయోగిస్తే, వాటి ప్లాస్టిసిటీ మారుతుందన్నారు. అందులోని మైక్రోప్లాస్టిక్స్ నీటిలో కలసిపోయే ప్రమాదం ముందన్నారు. అందువల్ల తాగునీటి క్యాన్లను 30 సార్లు మాత్రమే రీఫిల్ చేయాలని సూచించారు. ముఖ్యంగా, తాగునీటి క్యాన్ల మూతలను సీల్ చేసి, గడువు తేదీని మాత్రం చెరగని ఇంకుతో గుర్తు పెట్టాలని సూచించారు. అలాగే, చిన్న సింగిల్ యూజ్ డ్రింకింగ్ వాటర్ బాటిళ్లలో కూడా 'తాగిన తర్వాత నలిపివేయాలి' అనే పదాలు ఉండాలని ఆయన సూచించారు.





పూర్తయిన ఇరుళార్ కమ్యూనిటీ ఇళ్లు

పూర్తైన పేదల పక్కా ఇళ్ల నిర్మాణ పనులు

తిరుత్తణి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ఇరుళార్ కమ్యూనిటీకు చెందిన ప్రజల సంక్షేమార్థం రాష్ట్రప్రభుత్వం రూ.1.36 కోట్లతో గత ఏడాది చేపట్టిన ఉచిత ఇళ్ల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఈ ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ప్రాంతీయ అభివృద్ధి కార్యాలయం అధికారి సంతానం తెలిపారు. రాష్ట్రంలోని అణగారిన వర్గాలకు చెందిన ప్రజల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలుపరచే దిశగా అడుగులువేస్తోంది. ఈ నేపథ్యంలో తిరుత్తణి సమీపంలోని కన్నికాపురం పంచాయతీల్లో నివసిస్తున్న ఇరుళార్ జాతికి చెందిన 31 కుటుంబాలకు ఉచిత పక్కాఇళ్లను గిరిజన అభివృద్ధి పథకం కింద ఒక్కో ఇంటిని రూ.4.37 లక్షలతో నిర్మించింది. కొత్తగా ఏర్పడే ఈ ప్రాంతంలో రోడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్, మురుగునీటి కాలువలు తదితర పనులు మాత్రమే మిగిలివున్నాయని, త్వరలోనే వీటిని కూడా పూర్తిచేసి సంబంధిత కుటుంబాలకు అందిస్తామని సంతానం చెప్పారు.

దర్శకుడితో గొడవకు దిగిన నయనతార?



వివాదాలకు కేంద్ర బిందువుగా ఉన్న సీనియర్ హీరోయిన్ నయనతార తాజాగా సీనియర్ దర్శకుడు సుందర్.సితో సినిమా సెట్‌లో గొడవపడినట్లు కోలీవుడ్ వర్గాల సమాచారం. గతంలో నయనతార ప్రధాన పాత్రలో ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో వచ్చిన హిట్ మూవీ 'మూక్కుత్తి అమ్మన్'కు ఇపుడు సీక్వెల్ రూపొందుతోంది. అవ్నీ సినీమ్యాక్స్, రౌడీ పిక్చర్స్ సహకారంతో వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ మూవీని బడా నిర్మాత ఐసరి కె.గణేష్ నిర్మిస్తున్నారు. సుందర్.సి దర్శకుడు. నయనతార ప్రధాన పాత్రను పోషిస్తుండగా, దునియా విజయ్, రెజీనా కెసాండ్రా, యోగిబాబు, ఊర్వశి, అభినయ, రామచంద్ర రాజు తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ ప్రారంభమైంది. ఇదిలా ఉండగా తన కాస్ట్యూమ్స్ విషయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌ను నయనతార దూషించినట్లు సమాచారం. ఈ విషయం దర్శకుడు సుందర్‌కు తెలియడంతో నయనతారపై ఆగ్రహం వ్యక్తం చేశారనీ, సినిమా షూటింగ్‌ను సైతం నిలిపివేయాలనీ, నయనతార స్థానంలో తమన్నాను ఎంపిక చేయాలని దర్శకుడు కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అయితే, నిర్మాత ఐసరి కె.గణేష్ ఈ విషయంలో జోక్యం చేసుకుని సమస్యను సద్దుమణిగేలా చేశారు.

యంగ్ డైరెక్టర్లతో సూపర్‌స్టార్ రజనీ



సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను ముగ్గురు యువ దర్శకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వీరంతా కలిసి దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో రజనీ నటించారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్‌ప్రొడక్షన్ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. మరోవైపు, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్-2' షూటింగులో రజనీ పాల్గొంటున్నారు. ఆ లొకేషన్‌కు వచ్చిన కార్తిక్ సుబ్బురాజ్, లోకేష్ కనకరాజ్, నెల్సన్ దిలీప్ కుమార్... తలైవర్‌తో ఫొటో దిగారు. ఈ సందర్భంగా తన తదుపరి చిత్రంపై రజనీ చర్చించినట్లు సమాచారం. తన ఆరోగ్యం దృష్ట్యా త్వరలోనే తాను నటించే ఆఖరి చిత్రంపై రజనీకాంత్ ఓ ప్రకటన చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమా భారీగా, అద్భుతంగా ఉండటంతో పాటు అగ్రనటుడు కమల్ కూడా నటించేలా కథను సిద్ధం చేయాలని ఈ ముగ్గురు యంగ్ దర్శకులను రజనీకాంత్ కోరినట్టు ఇండస్ట్రీలో ఓ చర్చ సాగుతోంది.



'ఈఎంఐ' ఆడియో విడుదల

ఆరోగ్యకరమైన వాతావరణం లేదు



- ఆర్.వి.ఉదయకుమార్

తమిళ చిత్రపరిశ్రమలో ఆరోగ్యకరమైన వాతావరణం లేదని, మంచి నిర్మాణ సంస్థలు చిత్ర నిర్మాణానికి దూరంగా ఉన్నాయని ప్రముఖ సినీ దర్శకుడు, కోలీవుడ్ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శబరి ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత మలయ్యాన్ నిర్మించిన చిత్రం 'ఈఎంఐ' (మాద దవణై). కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన సదాశివం చిన్నరాజ్ హీరోగా నటించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా రూపొందించిన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ వేడుక శుక్రవారం రాత్రి చెన్నైలో జరిగింది. ప్రముఖ దర్శకులు కె.భాగ్యరాజ్, ఆర్.వి. ఉదయకుమార్, పేరరసు, సినీ నటి దేవయానితో పాటు చిత్ర బృందం పాల్గొనింది. ఈ సందర్భంగా ఆడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.వి.ఉదయకుమార్ మాట్లాడుతూ... 'ఈ వేడుక నాకు ఒక ఫ్యామిలీ ఫంక్షన్‌లాంటిది. ఈఎంఐతో ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కవచ్చు. ఇప్పుడు మంచి నిర్మాణ సంస్థలు చిత్ర నిర్మాణానికి దూరంగా ఉంటున్నాయి. మంచి నటులను ఎంపిక చేసి సినిమాలు నిర్మించే కంపెనీలు లేవు. ఆ కాలంలో ఒక సినిమా ప్రారంభం రోజునే వ్యాపారం పూర్తయ్యేది. ఇపుడు పరిస్థితి అధ్వానంగా ఉంది. అప్పుడు నెలలో 16 సినిమాలు విడుదలైతే అన్ని చిత్రాలు విజయవంతం అయ్యేవి. ఇపుడు ఆనాటి ఆరోగ్యకర వాతావరణం చిత్రపరిశ్రమలో లేదు. ఇప్పటి దర్శకులను ఫోన్‌లో కూడా సంప్రదించలేని పరిస్థితి. మన తమిళ సినిమా ఎక్కడకు వెళుతుందో తెలియడం లేదు' అని అన్నారు. కె.భాగ్యరాజ్ మాట్లాడుతూ... 'సినిమా టైటిల్ బాగుంది. నిర్మాత మల్లయ్యాన్ దర్శకుడిని హీరోగా ఎంచుకోవడం ఆయన ధైర్యానికి మెచ్చుకోవచ్చు. పాటలు, విజ్యువల్స్ బాగున్నాయి. నా తొలి చిత్రానికి ఒక చెత్త కథను సిద్ధం చేసుకున్నా. కానీ, అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేయడం ప్రారంభించిన తర్వాత ఆ స్టోరీని చెత్తబుట్టలో పడేశా. మన జీవితంలోని సంఘటనలనే ఎంచుకుని సినిమాలు తీస్తే అవి విజయవంతమైన చిత్రాలుగా నిలుస్తాయి' అని అన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ... 'ప్రతి ఒక్కరూ ఏదో సమయంలో ఈఎంఐలో తమకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసి ఉంటారు. తొలి మూడు నెలలు బాగానే చెల్లిస్తారు. ఆ తర్వాతే అసలు సమస్య. పురుషులు ఆఫీసులకు వెళితే ఇంటికి వచ్చే బ్యాంకు సిబ్బందికి మహిళలు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ మూవీని ప్రతి ఒక్కరూ చూడాల్సిన చిత్రం. ఈఎంఐ జీవితం ప్రాణాలతో పోరాటం చేస్తూ తనువు చాలిస్తారు. ఈ విషయాన్నే ఈఎంఐ చెబుతుంది. ఇపుడు టాస్మాక్ ఒక మత్తు... ఈఎంఐ ఒక వ్యసనం' అని అన్నారు. హీరోయిన్‌గా సాయిధాన్య నటించగా, శ్రీనాథ్ పిచ్చాయ్ సంగీతం అందించారు.

డిటెక్టివ్ నేపథ్యంలో 'ది వెర్డిక్ట్'

మర్డర్ మిస్టరీ, థ్రిల్లర్, డిటెక్టివ్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'ది వెర్డిక్ట్'. మూవీ ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటుడు ఆర్.శరత్‌కుమార్ శనివారం విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమైన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, శ్రుతిహాసన్, సుహాసిని, విద్యుల్లేఖ రామన్, ప్రకాష్ మోహన్‌దాస్ తదితరులు నటించారు. కృష్ణ శంకర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అగ్ని ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై నిర్మాత ప్రకాష్ మోహన్‌దాస్ నిర్మించారు. సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'ధనవంతురాలైన ఒక అమెరికా మహిళ హత్యకు గురవుతుంది. ఆమెను చూసేందుకు వచ్చిన స్నేహితురాలు ఈ కేసులో చిక్కుకుంటారు. కష్టాల్లో ఉన్న భార్యను రక్షించేందుకు భర్త న్యాయపోరాటం చేస్తాడు. ఎలాంటి తప్పు చేయని తన భార్య నిర్దోషి అంటూ మొరపెట్టుకుంటాడు. ఇలా హత్యా నేపథ్యంలో సాగే ఈ స్క్రీన్‌ప్లే అనేక ఆసక్తికర మలుపులతో అంతుచిక్కని మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా రూపొందించారు. కథ మొత్తం అమెరికాలో జరుగుతుంది. అందుకే షూటింగ్ కూడా అక్కడే పూర్తి చేశాం. అమెరికాను కేవలం బ్యాక్‌గ్రౌండ్‌గా చూపించకుండా అక్కడి లైఫ్‌స్టైల్, పోలీస్, ఇన్వెస్టిగేషన్ యాక్టివిటీస్, కోర్ట్ తదితర అంశాలను ఇందులో చూపించాం. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్ర కథ.. ప్రేక్షకుడికి సీట్ ఎడ్జ్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది' అన్నారు.



'ది వెర్డిక్ట్'లో వరలక్ష్మి, సుహాసిని తదితరులు



దర్శకుడు క్రిష్ - అమరనాథ్ నంబూత్రి

తిరుమలలో దర్శకుడు క్రిష్

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు క్రిష్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే అమరనాథ్ కేదార్‌నాథ్ వంశపారంపర్య అర్చకులు అమరనాథ్ నంబూత్రి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

అహోబిలం పీఠాధిపతికి టీటీడీ పెద్ద మర్యాద

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): అహోబిలం పీఠాధిపతి శ్రీరంగనాథ యతీంద్ర జీయర్‌స్వామి శనివారం టీటీడీ పెద్ద మర్యాదతో శ్రీవారిని దర్శించుకున్నారు. అఖిలాండం వద్ద పీఠాధిపతికి టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం శఠగోపంతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

టెంపుల్ కారిడార్‌గా అలిపిరి మంచి నిర్ణయం: భానుప్రకాష్



తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): అలిపిరి ప్రాంతాన్ని టెంపుల్ కారిడార్‌గా నిర్ణయించి భవిష్యత్తులో ఎలాంటి ధార్మిక వ్యతిరేక కార్యక్రమలూ జరగకుండా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. తిరుమల ఆలయం ముందు శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను సీఎం చంద్రబాబు రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇక, శ్రీవారి ఆలయంలోని పరకామణిలో జరిగిన కోట్లాది రూపాయల దొంగతనంపై సీఐడీ విచారణకు డిమాండ్ చేస్తున్నానన్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,170
తలనీలాలు సమర్పించినవారు: 26,821

'తుడా' టవర్స్‌కు పెరుగుతున్న క్రేజ్

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఇక ఆకాశ హర్మ్యాలు రాబోతున్నాయి. మహానగరాల్లో మాత్రమే కనిపించే ఆధునిక హంగులు, సకల సౌకర్యాల సౌధాలు క్యూ కడుతున్నాయి. చింతలచేనులో ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థ 13 అంతస్థులతో రెసిడెన్షియల్ టవర్స్ నిర్మించింది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో 14 అంతస్తుల్లో తుడా టవర్స్ పేరిట వేగంగా నిర్మాణం సాగుతోంది. దీనికి జనం నుంచి క్రేజ్ కనబడుతోంది.

తొలుత 20 అంతస్థులతో ఐకానిక్ టవర్స్ నిర్మించాలని 'తుడా' ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుంది. డీపీఆర్ సిద్ధం చేసింది. చివరి నిమిషంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అభ్యంతరం చెప్పింది. డీజీసీఏ నిబంధనల ప్రకారం విమానాశ్రయం 5 కి.మీ వ్యాసార్థంలో ఏ భవనం కూడా 45 మీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదు. అంటే భవనం 14 అంతస్తులపైన నిర్మాణం చేయకూడదు. తుడా టవర్స్ దూరం 10 కి.మీ పైనే ఉన్నప్పటికీ ఎయిర్ ట్రాఫిక్ ఆ ప్రాంతం నుంచే ఎక్కువగా ఉండడంతో ఎన్వోసీ ఇవ్వనట్టు తెలుస్తోంది. దీంతో 14 అంతస్థులకు పరిమితం చేసుకుని.. మళ్లీ రీడిజైన్ చేసి నిర్మాణం మొదలుపెట్టింది. వైసీపీ హయాంలో తుడా టవర్స్ పునాదుల్లో ఉన్నప్పుడే వేలం పిలిచారు. రెండు, మూడు కమర్షియల్ గదులు తప్ప తక్కినవాటికి బోణీ కాలేదు. ప్రభుత్వం మారితే నిర్మాణం ఆగిపోతుందేమోనన్న భయం కొనుగోలుదారుల్లో కనిపించింది.



ఇప్పుడేమో ప్రభుత్వం మారాక పనులు వేగవంతమయ్యాయి. ఆరంతస్తుల నిర్మాణం పూర్తిచేసుకుని వేలానికి సిద్ధమైంది. ఈనెల 8నుంచి వేలం ప్రక్రియ మొదలైనప్పటికీ శని, ఆదివారాలు సెలవులు రావడంతో మూడు రోజుల్లోనే 23 ప్లాట్లు అమ్ముడుపోయినట్లు అధికారులు చెబుతున్నారు. 'తుడా టవర్స్‌కు విశేష స్పందన వస్తోంది. ఇప్పటికే కొన్ని బ్యాంకులు, కంపెనీలు ఆఫీస్ స్పేస్ కోసం పోటీ పడుతున్నాయి. వచ్చే ఏడాది మార్చిలోపు కొనుగోలుదారులకు అప్పగిస్తాం' అని తుడా వీసీ ఎన్.మౌర్య తెలిపారు.

ఏడాదికి అందుబాటులోకి

3.6 ఎకరాల్లో రూ.345కోట్లతో 'తుడా' టవర్స్ నిర్మాణం సాగుతోంది. గ్రౌండ్, ఒకటవ అంతస్థుల్లో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన వాటిలో 230 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. వీటిలో 42 డబుల్.. 152 ట్రిపుల్.. 32 నాలుగు బెడ్ రూమ్ ఫ్లాట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. కమర్షియల్, రెసిడెన్షియల్‌కు వేర్వేరుగా పార్కింగ్, లిఫ్టులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాదిలోపు పూర్తిగా అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఐకానిక్ టవర్స్‌లో వసతులు, ధరలు ఇలా..

స్విమ్మింగ్ పూల్, వాకింగ్ పార్కు, పోడియం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రెస్టారెంట్, బంకేట్ హాల్, సూపర్ మార్కెట్, బ్యాంక్, బ్యాడ్మింటన్ కోర్టులు, యోగ ఇతర ఇండోర్ క్రీడల సౌకర్యాలను అందుబాటులో ఉంచనున్నారు. రెసిడెన్షియల్ కోసం 2బీహెచ్‌కే.. 1238 ఎస్ఎఫ్టీ- రూ.70లక్షలు, 3బీహెచ్‌కే.. 1903 ఎస్ఎఫ్టీ- రూ.1.12కోట్లు, 4బీహెచ్‌కే.. 3743 ఎస్ఎఫ్టీ- రూ.2.19కోట్లు చొప్పున ధరలు నిర్ణయించారు. కమర్షియల్ కోసం గ్రౌండ్ ఫ్లోర్.. 42664 ఎస్ఎఫ్టీ- ఒక్కో ఎస్ఎఫ్టీ రూ.12వేలు చొప్పున, ఫస్ట్ ఫ్లోర్ 64724 (రూ.10వేలు), ఆఫీస్ స్పేస్ 89919 ఎస్ఎఫ్టీ (రూ.7,500) ధరగా నిర్ణయించారు.

రామచంద్రాపురం ఎస్ఐ వీఆర్‌కు..

ట్రైనీ ఐపీఎస్ హేమంత్‌కు బాధ్యతలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎస్ఐ రామాంజనేయులును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌ను స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఈయన ఎనిమిది నెలల పాటు అక్కడ విధి నిర్వహణలో ఉంటారు.

కేకేసీ కళాశాల విద్యార్థులకు ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందును ఆరగిస్తున్న విద్యార్థులు

పుత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో వివిధ మతాల విద్యార్థుల మధ్య అన్యోన్యత, సోదరభావం పెంచేందుకు రంజాన్ ఇఫ్తార్ విందును ఆనవాయితీగా అందిస్తున్నామని కేకేసీ హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శరవణన్ తెలిపారు. రంజాన్ ఇఫ్తార్ విందును శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులు రంజాన్ ఉపవాసాలను భక్తి శ్రద్ధలతో చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్లు కుప్పయ్యశెట్టి, నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆఫ్‌లైన్‌లో అద్దె చెల్లింపులకు ఆదేశం

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఇళ్లు, దుకాణాలు, మఠాలు, కార్యాలయాలకు సంబంధించిన అద్దె, కరెంటు, వాటర్ బిల్లులు ఆఫ్‌లైన్ ద్వారా కూడా కట్టించుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను శనివారం ఆదేశించారు. అద్దె, కరెంటు, వాటర్ బిల్లులను ఆన్‌లైన్‌లో కట్టాలనే నిబంధనతో తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న కౌంటర్‌లో కంప్యూటర్‌కు యాక్సెస్‌ను గురువారం నుంచి కట్ చేసిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారంటూ 'తిరుమలలో ఆగిన ఆఫ్‌లైన్ అద్దె చెల్లింపులు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు స్థానికులకు ఇబ్బంది లేకుండా కౌంటర్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శనివారం నుంచే కౌంటర్‌ను తెరవాలని అధికారులు ఆదేశించినప్పటికీ బ్యాంక్ సెలవు నేపథ్యంలో తిరిగి సోమవారం నుంచి కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని బ్యాంక్ సిబ్బంది తెలిపారు.

అభాగ్యుడికి అండగా...

ఆంధ్రజ్యోతి-వైద్యజ్యోతి

- కలెక్టరు చొరవతో ఉచిత వైద్యానికి భరోసా

తిరుపతి(వైద్యం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు రోజుల వైద్యజ్యోతి మెగా హెల్త్‌క్యాంప్‌లో ఒక అభాగ్యుడికి కలెక్టర్ చొరవతో వైద్య సాయానికి మార్గం సుగమం అయ్యింది. నా అనే వాళ్లు లేక, ఆరోగ్య పరిస్థితి సహకరించక శ్రీకాళహస్తిలోని ఒక అనాథాశ్రమంలో ఉంటూ జీవనం సాగిస్తున్న బందాడ శ్రీనివాస్(76) వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవడానికి శనివారం వచ్చాడు. కలెక్టర్ వెంకటేశ్వర్ అతన్ని పలకరించారు. తన నిస్సహాయ స్థితిని అతను కలెక్టర్‌కి వివరిస్తూ కంట తడిపెట్టుకున్నాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన చేతిలోని మెడికల్ రిపోర్టులన్నీ తీసుకుని పరిశీలించారు. వెంటనే స్విమ్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వృద్ధుడికి అవసరమైన వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందజేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని స్విమ్స్‌కు లేఖ రాసి వృద్ధుడికి అందించి వెంటనే స్విమ్స్‌కు వెళ్లాలని సూచించారు. అందుకు అవసరమైన రవాణా సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయడంతో శ్రీనివాస్ పొంగుతున్న కన్నీళ్లతో కలెక్టర్‌కు చేతులు జోడించారు. ఆంధ్రజ్యోతి-వైద్యజ్యోతి శిబిరానికి రావడం తనకు ఎంతో మేలు చేసిందని కృతజ్ఞతలు తెలిపారు.



కలెక్టర్‌కు నమస్కరిస్తున్న బందాడ శ్రీనివాస్

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్లాట్‌ఫామ్ పైకి బ్యాగ్ విసిరిన ప్రయాణికుడు

- నాలుగు కిలోల గంజాయి సీజ్




రైలులో నుంచి విసిరిన బ్యాగ్ - గంజాయి ప్యాకెట్లు

దొరవారిసత్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తు తెలియని ప్రయాణికుడు ప్లాట్‌ఫామ్ పైకి విసిరిన బ్యాగ్‌లో గంజాయి ఉన్నట్లు జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం కామాఖ్య నుంచి చెన్నై మీదుగా యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దొరవారిసత్రం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ పైకి నల్ల బ్యాగ్‌ను విసిరేశాడు. బ్యాగ్‌లో ఏముందోనన్న ఆందోళనతో అప్రమత్తమైన రైల్వేస్టేషన్ సిబ్బంది జీఆర్‌పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్‌పీ ఎస్ఐ చెన్నకేశవ సిబ్బందితో కలిసి బ్యాగ్‌ను పరిశీలించగా నాలుగు కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. తమిళనాడుకు గంజాయిని తరలించే క్రమంలో పోలీసుల కంట పడి గంజాయి ప్యాకెట్లు ఉన్న బ్యాగ్‌ను ప్లాట్‌ఫామ్ పైకి విసిరేసి ఉంటారని జీఆర్‌పీ పోలీసులు అనుమానిస్తున్నారు. గంజాయిని సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు.

మరో మైలురాయిని అధిగమించిన శ్రీసిటీ-కొబెల్కో



- కొబెల్కో నుంచి 20,000వ ఎక్స్‌కవేటర్ విడుదల

వరదయ్యపాళెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిర్మాణ పరికరాల తయారీ దిగ్గజ కంపెనీ కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా శ్రీసిటీ ప్లాంట్‌లో 20,000వ ఎస్‌కే 220 ఎక్స్‌కవేటర్ ఉత్పత్తితో ఒక ప్రధాన మైలురాయిని అధిగమించింది. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం కంపెనీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ అద్భుత విజయం పట్ల కేసీఈఐకి ఆయన అభినందనలు తెలిపారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రా సన్నారెడ్డి, కేసీఈఐ సేల్స్ మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్ సమక్షంలో ఎండీ, సీఈవో టకేమిచి హిరకావా లాంఛనంగా 20,000వ ఎక్స్‌కవేటర్‌ను విడుదల చేసి దానిని తమ ప్రధాన కస్టమర్ కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జలంధర్‌రెడ్డికి అందజేశారు. టకేమిచి హిరకావా మాట్లాడుతూ ఈ మైలురాయి తమ సంస్థ నిబద్ధతను సూచిస్తుందన్నారు. కేసీఈఐ ప్రారంభం నుంచి తమకు అమూల్యమైన సహకారం అందిస్తున్న శ్రీసిటీ ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ 20,000వ యూనిట్‌ను అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

20,000వ ఎక్స్‌కవేటర్ కీని జలంధర్‌రెడ్డికి అందచేస్తున్న కేసీఈఐ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్, ఎండీ, సీఈవో టకేమిచి హిరకావా, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రా సన్నారెడ్డి తదితరులు

ముగిసిన కేజే కృష్ణమూర్తి అంత్యక్రియలు

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కేజే కృష్ణమూర్తి అంత్యక్రియలు శనివారం ముగిశాయి. కపిలతీర్థం రోడ్డులోని రామచంద్రనగర్‌లోని ఆయన నివాసం నుంచి అశ్రనయనాల నడుమ అంతిమయాత్ర హరిశ్చంద్ర శ్మశాన వాటిక వరకు సాగింది. అక్కడ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కృష్ణమూర్తి భౌతిక కాయానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, సప్తగిరి పత్రిక చీఫ్ ఎడిటర్ రాధారమణ, టీటీడీ సీపీఆర్వో రవి, విశ్రాంత ప్రొఫెసర్ సర్వోత్తమరావు, డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి, ఆకెళ్ల విభీషణశర్మ, ఎస్కేయూ ప్రొఫెసర్, బాల సుబ్రహ్మణ్యం, ఓఆర్ఐ డైరెక్టర్, సిబ్బంది, శ్వేత సిబ్బంది, టీటీడీ సిబ్బంది నివాళులు అర్పించారు.

'30 రోజుల్లో తెలుగు రీడింగ్ చాలెంజ్' ఎంతో ఉపయుక్తం

- ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి(విద్య), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన '30 రోజుల్లో తెలుగు రీడింగ్ చాలెంజ్' కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉందని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ పేర్కొన్నారు.తిరుపతికి చెందిన భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చారు. తిరుపతి సంజయ్ గాంధీ కాలనీ మున్సిపల్ పాఠశాల, చంద్రగిరిలోని జేఆర్‌కేఆర్ ప్రాథమిక పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. 30 రోజుల పాటు సాగిన శిక్షణ శనివారంతో ముగిసింది. తిరుపతి సంజయ్‌గాంధి కాలనీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆర్జేడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 3వ తరగతి విద్యార్థులతో 10వ తరగతి పుస్తకాలను చదివించి శిక్షణ ఫలితాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృభాషలో చదవడం, రాయడం బాగా వచ్చిన విద్యార్థులు ఇతర భాషల్లో కూడా ప్రావీణ్యత సాధించగలరన్నారు. ఈ శిక్షణద్వారా 2, 3 తరగతులు విద్యార్థులు కూడా 10వ తరగతి పాఠ్యపుస్తకాలను ధారాళంగా చదువుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్ని పాఠశాలల్లో 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టేలా ప్రయత్నిస్తామని చెప్పారు. డీఈఓ కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ 30 రోజుల్లో తెలుగు చదవడం, రాయడంపై శిక్షణతో సత్ఫలితాలు వచ్చాయన్నారు. అనంతరం శిక్షకులు భాస్కర్‌రాజును ఆర్జేడీ, డీఈఓ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, అర్బన్ ఎంఈవో భాస్కర్‌నాయక్, హెచ్‌ఎం ధనుంజయులునాయడు, ఉపాధ్యాయులు పద్మావతి, విజయ్‌కుమారి, అనిత, అనిల్‌కుమార్, ప్రవీణ, లావణ్య, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.



భాస్కర్‌రాజును సత్కరిస్తున్న ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ కేవీఎన్ కుమార్, ధనుంజయులు నాయుడు తదితరులు

భక్తులతో శ్రీవారిమెట్టు కిటకిట



చంద్రగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గం శనివారం భక్తులతో కిటకిటలాడింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. మరోపక్క కనీస వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులను టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది అదుపు చేయలేకపోయారు. దీంతో చంద్రగిరి పోలీసులు చేరుకుని వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఉదయం సమయంలో ఉచిత బస్సు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ఆటోవాలాలు ఇష్టం వచ్చినట్లు రేట్లు వసూలు చేస్తున్నారని భక్తులు వాపోయారు. టోకెన్ల ఆశ చూపి ఆటో డ్రయివర్లు ఇక్కడికి తీసుకువచ్చారని పలువురు భక్తులు చెప్పారు. టోకెన్ల కోసం కొందరు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. డిమాండుకు తగిన విధంగా టోకెన్లు ఇస్తే తమకు ఈ కష్టం ఎదురుకాదని వారు చెబుతున్నారు.

సైబర్ వలలో చిక్కిన మహిళ

- రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఒక మహిళ సైబర్ వలలో చిక్కి రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న ఘటన తిరుపతి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు చెప్పిన వివరాల మేరకు.. సాయినగర్ పంచాయతీ టెలిఫోన్ కాలనీకి చెందిన మహిళ కాంట్రాక్టు టీచర్‌గా పనిచేస్తోంది. ఆమె ఇన్వెస్ట్‌మెంటు అలియన్స్ ట్రైయినింగ్ గ్రూపు వీఐపీ సీ9 హరిసింగ్ బుక్ డిస్కషన్ కెనాన్ అసెట్స్ దత్తా అనే వాట్సాప్ గ్రూపులో చేరారు. అధిక డబ్బు ఆశ చూపించి గ్రూపు అడ్మిన్లు హరిసింగ్, కెనాన్ అసెట్స్ దత్తా క్వాలిటీ పవర్ ఇపో బీజెసాన్ ఇపో హెక్సావేర్ టెక్నాలజీస్ ఇపో స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టమని ప్రేరేపించారు. వారు సూచించిన మేరకు బంధన్, ఐడీఎఫ్‌సీ, యూకో, ఆర్ఎంజీబీ తదితర 10 బ్యాంకు అకౌంట్లకు ఆమె రూ.55.85 లక్షలు జమచేశారు. కొన్ని రోజుల తర్వాత వాట్సాప్ గ్రూపులు క్లోజ్ అయ్యాయి. నిర్వాహకులు అందుబాటులో లేకుండాపోయారు. మోసపోయానని గుర్తించిన బాధితురాలు వెంటనే సైబర్ క్రైం 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ కేసు నమోదు చేశారు.

రూ.22 లక్షలు పోగొట్టుకున్న మరో యువతి

సైబర్ మోసగాళ్ల వలలో పడి ఓ యువతి రూ.22 లక్షలు పోగొట్టుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ కథనం మేరకు.. స్థానిక జీవకోన గోపాల్‌నగర్‌లో ఉంటున్న రేవతి బీటెక్ వరకు చదువుకుంది. వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేస్తోంది. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ యాప్ ద్వారా ఆమె వాట్సాప్ నెంబరుకు ఓ మెసేజ్ పెట్టారు. టెలిగ్రామ్ యాప్‌లో హోటళ్లకు ఆన్‌లైన్ రివ్యూల ద్వారా రేటింగ్ ఇస్తే డబ్బులు వస్తాయని నమ్మించారు. అలాగే నమ్మకంగా చేస్తే సంస్థలో ఉద్యోగం కూడా ఇస్తామని చెప్పారు. వారి మాటలు ఆమె నమ్మింది. ఇంట్లో ఉన్న బంగారం తాకట్టు పెట్టి కొంత నగదు, తన అకౌంట్లో ఉన్న డబ్బులతో పాటు తెలిసిన వారి వద్ద అప్పులు చేసింది. మొత్తం రూ.22 లక్షలు కేటుగాళ్లు చెప్పిన అకౌంట్లలో నాలుగు విడతల్లో జమచేసింది. ఆ తర్వాత వారి వాట్సాప్ నెంబర్లు బ్లాక్ కావడంతో మోసపోయానని గ్రహించి 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. శనివారం అలిపిరి సీఐ రాంకిషోర్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేశారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల గుర్తింపు

- ఇందులో ఓ పాతనేరస్తుడు కూడా..



తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం పోలీసులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో 72 అనధికార వ్యక్తులను గుర్తించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు మూడు బృందాలుగా ఏర్పడి తిరుమలలోని వరాహస్వామి, కల్యాణకట్ట, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఎలాంటి గుర్తింపు లేకుండా ఉంటున్న 72 మందిని గుర్తించారు. వారి పూర్వాపరాల గురించి ఆరా తీశారు. వారిని తిరుపతి తరలించార. ఇందులో 28 మంది స్త్రీలు ఉన్నారు. పోలీసులు గుర్తించిన అనధికార వ్యక్తుల్లో ఓ పాత నేరస్థుడు కూడా ఉండటం గమనార్హం. ప్రకాశం జిల్లాకు చెందిన రవి అనే పాతనేరస్థుడి వివరాలు బయటపడ్డాయి. తిరుమల ట్రాఫిక్,తిరుపతి ఎంవీఐ మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకుని రూ.1.50లక్షలు జరిమానా విధించారు.

రేపు ఎల్లుండి విద్యుత్ సదస్సులు

రామచంద్రాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి సోమవారం, మంగళ వారాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఉన్నతాధికరుల ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు ఆశాఖ ఏఈ గిరి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9గంటలకు కుప్పంబాదూరు, సాయంత్రం 4గంటలకు నెత్తకుప్పం సబ్‌స్టేషన్లలో ఈఈ ఆశీర్వాదం, డీఈఈ శంకరయ్య ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు వెంకటరామాపురం, సాయంత్రం 4గంటలకు నడవలూరు సబ్‌స్టేషన్లలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తెలుగు సాహితీ సంఘాల ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం జరగనుంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి ఆసక్తి కలిగిన కవులు, రచయితలు పాల్గొనాలని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందులో పాల్గొనే వారిలో ఐదుగురు ఉత్తమ కవులను సత్కరిస్తారని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు.